ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

❖ తుపానులతో దెబ్బ తిన్న ఉద్యాన పంటల పునరుద్ధరణకు ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు.

❖ రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు నూతన పరికరాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

❖ అర్హులైన ఓటర్లు తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు.

❖ రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నూతన జడ్పీ చైర్ పర్సన్లు, వైస్ చైర్ పర్సన్లు ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.

==========

వరుస తుపానుల కారణంగా దెబ్బ తిన్న ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనపు సహాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఇటీవల సంభవించిన ఓర్నాబ్, మురాసు తుపానుల కారణంగా 18 జిల్లాల్లోని 29 వేల 960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిని, 71 వేల 576 మంది రైతులు నష్టపోయారని లేఖలో పేర్కొన్నారు. దెబ్బతిన్న తోటల పునరుద్ధరణ, రైతులను ఆదుకునేందుకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా 96 కోట్ల 33 లక్షల రూపాయల సహాయం అందించాలని, మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్మెంట్ స్కీమ్ కింద అరటి పంటకు హెక్టారుకు 44 వేల రూపాయల చొప్పున నిధులు అందించాలని కోరారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఎండుమిర్చి, కూరగాయల పంటలను ఆదుకోవాలని, వివిధ జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు నుంచి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. తోటల పునరుద్ధరణ, దీర్ఘకాలిక ఆర్థిక నష్టాలను తగ్గించేందుకు త్వరితగతిన సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన లేఖలో కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

==========

రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు సెన్సార్ల ఆధారంగా పనిచేసే ఆధునిక పరీక్షా విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గ్రామాల్లో మహిళల ఇళ్ల వద్ద కానీ, విలేజ్ హెల్త్ క్లినిక్ లలో కానీ ఈ పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు మంత్రి ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖ మెడ్‌టెక్ ఛాలెంజ్ ద్వారా కృత్రిమ మేధ ఆధారిత వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని, ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ఆయన వివరించారు. యూఈ లైఫ్‌సైన్సెస్ సంస్థ ఐబ్రెస్ట్ ఎగ్జామ్ (ఐబీఈ) అనే చిన్నపరికరాన్ని అభివృద్ధి చేసిందని, దీనికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ, భారతదేశంలో కేంద్ర ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థల అనుమతులు లభించాయని చెప్పారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సంస్థ సామాజిక బాధ్యత నిధుల కింద 750 ఐబ్రెస్ట్ ఎగ్జామ్ పరికరాలను వైద్యారోగ్య శాఖకు అందించేందుకు అంగీకరించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు.

==========

అర్హులైన ఓటర్లు తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) సమయంలో ఓటర్ల జాబితా నుండి పెద్ద సంఖ్యలో పేర్లను తొలగించారంటూ.. ఆందోళనలు జరిగిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటర్ల జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఓటర్ల కోసం ఎన్యూమరేషన్ ఫారాలు మరలా ముద్రించబడతాయని, పూర్తి చేసిన ఫారాలను ఓటరు సంతకంతో సంబంధిత ERO, AERO లేదా BLOలకు స్వయంగా కాని, లేదా కుటుంబ సభ్యుల ద్వారా కాని అందజేయాలని ప్రకటనలో తెలియజేశారు.

==========

రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు వివిధ జిల్లాల్లో నూతన జడ్పీ చైర్ పర్సన్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లు వారి చేత ప్రమాణం చేయించారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎల్.ఎన్.పేట జడ్పీటీసీ కొరికాన భవాని, వైస్ చైర్మన్‌గా వజ్రపుకొత్తూరు జడ్పీటీసీ గుంటు విజయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ గా భామిని జడ్పీటీసీగా నీలిమ నిమ్మల, కురుపాం జడ్పీటీసీ వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ వైస్ చైర్‌పర్సన్ గాను పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. విజయనగరం జిల్లా తెర్లాం జడ్పీటీసీ మజ్జి సిరి సహస్ర జడ్పీ చైర్ పర్సన్‌గా, వైస్ చైర్ పర్సన్‌గా బొండపల్లి జడ్పీటీసీ పాశల నీరజ బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా రాయవరం జడ్పీటీసీగా కాద పద్మ, వైస్ చైర్‌పర్సన్‌గా నిడదవోలు జడ్పీటీసీ పల్నాటి రజిని బాధ్యతలు స్వీకరించారు. మామిడికుదురు జడ్పీటీసీ గొల్లపల్లి అమూల్య.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గాను, వైస్ ఛైర్ పర్సన్ గా కొత్తపేట జడ్పీటీసీ సభ్యుడు ఎలిశెట్టి రామకృష్ణ పదవీ ప్రమాణం చేశారు.

విరామం

==========

57వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం (IFFI) ఈరోజు గోవాలో ప్రారంభమైంది. తలేగావ్‌లోని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్, ఫెస్టివల్ డైరెక్టర్, చిత్రనిర్మాత అశుతోష్ గోవారికర్ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి లోక్‌సభ ఎంపీ రవి కిషన్, ప్రసార భారతి సీనియర్ ఛైర్మన్ ప్రసూన్ జోషి, నటులు కార్తీక్ ఆర్యన్, శ్రద్ధా కపూర్, సాయి పల్లవితో సహా పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఉత్సవంలో 86 దేశాల నుండి 150కి పైగా అంతర్జాతీయ చిత్రాలతో పాటు, ఇండియన్ పనోరమా విభాగం కింద 18 భాషల్లో 76 చిత్రాలు ప్రదర్శించబడుతున్నాయి.

==========

భీమవరం ఆక్వాకల్చర్ క్లస్టర్ అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - ఐస్‌లాండ్ ఓషన్ క్లస్టర్ మధ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈరోజు జరిగిన ఎంవోయూ ద్వారా చేపలు, రొయ్యల సంపూర్ణ వినియోగం, సముద్ర ఉత్పత్తుల ద్వారా అదనపు విలువ సృష్టించేందుకు దోహదపడనుంది. ఆధునిక ప్రాసెసింగ్ టెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, వ్యర్థాల నుంచి విలువైన ఉత్పత్తుల తయారీలో రాష్ట్ర ప్రభుత్వం - ఐస్‌లాండ్ ఓషన్ క్లస్టర్‌లు పరస్పర సహకారం అందించుకోనున్నాయి. అలాగే.. పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, శిక్షణ, అంకుర సంస్థల ప్రోత్సాహానికి ఐస్‌లాండ్ క్లస్టర్ సహకారం అందించనుంది. ఈ అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ రంగంలో సుస్థిర అభివృద్ధి, ఎగుమతులు, అదనపు ఆదాయ అవకాశాలకు బాటలు పడనున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి.

==========

మాదకద్రవ్యాల మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జరిగిన `నషా ముక్త్ భారత్ అభియాన్` ఎన్‌కార్డ్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమిష్టి కృషి, నిరంతర పర్యవేక్షణ, విస్తృత తనిఖీలు, ప్రజల్లో అవగాహన పెంపు ద్వారా జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని.. ఇవి మంచి ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. 149 హాట్‌స్పాట్ లపై ప్రత్యేకంగా దృష్టి సారించి, మాదకద్రవ్యాల ఆనవాళ్లు లేకుండా చూస్తున్నామన్నారు. గత సంవత్సరం 137 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 52 కేసులు నమోదయ్యాయన్నారు. ఎన్టీఆర్ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్ది, యువతకు సురక్షితమైన భవిష్యత్‌ను అందించడంతో పాటు, ప్రజల్లో భరోసా కల్పించడమే లక్ష్యంగా నిరంతరం చర్యలు కొనసాగిస్తామని కలెక్టర్ వివరిస్తూ... ఇందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

==========

నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, మార్కెట్ జోక్యంపై సంవత్సర కాలానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో నిత్యావసరాల ధరల నియంత్రణపై ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ధరల పెరుగుదలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రతివారం అధికారులు సమీక్షించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా ధరలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కందిపప్పు, గోధుమ పిండి, పామాయిల్‌ను రేషన్ షాపుల ద్వారా విక్రయించనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రైతు బజార్ల ద్వారా ఉల్లి విక్రయాలు జరుగుతున్నాయని, `ధరణి బ్రాండ్` పేరుతో తక్కువ ధరకు రైతు బజార్లల్లో విక్రయిస్తున్న బియ్యానికి మంచి డిమాండ్ ఏర్పడిందని మంత్రి మనోహర్ ముఖ్యమంత్రికి వివరించారు.

==========

వెలింగ్టన్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టానికి 159 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ 52, దేవదత్ పడిక్కల్ 16 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు యశస్వి జైస్వాల్ 85 పరుగులు చేశాడు. దీంతో భారత్ ఇంకా 209 పరుగుల వెనుకంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 368 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

==========
==========